'ఆంధ్రజ్యోతి' డైలీ (ఆదివారం) - 10.4.2005

# నిరసన

మరో వారం రోజుల్లో రిపబ్లిక్ డే సెలబ్రేషన్స్. కంపెనీ యాజమాన్యం హడావిడి. కార్మికుల్లో ఆనందోత్సాహాలు. గత నలభై రెండేళ్ళుగా ఆ కంపెనీ చరిత్రలో లేని రెండు విశేషాలు ఈ రిపబ్లిక్ డే నాడు చోటు చేసుకోబోతున్నాయి. ఒకటి: ఒక సీనియర్ కార్మికుడి చేత జెండా ఎగురవేయించడం. రెండు: ఒక ఉత్తమ కార్మికుడికి 'బెస్ట్ వర్కర్' అవార్డు యివ్వడం.

ఇలాంటి సంప్రదాయం గతంలో లేదు. కేంద్రప్రభుత్వం నుంచి కొత్తగా నియమింప బడిన మేనేజింగ్ డైరెక్టర్ ముఖర్జీ చేసిన మార్పు అది. చార్జ్ తీసుకున్న మరుసటి రోజే ఆయన ఈ రెండు విషయాలూ ప్రకటించేడు.

కార్మికులు యావత్తూ హర్షం వెలిబుచ్చేరు.

అప్పటికి ఆ ఇద్దరు వ్యక్తులు ఎవరో యాజమాన్యం అధికారికంగా ప్రకటించకపోయినా జాతీయ పతాకం ఎగురవేసే సీనియర్ కార్మికుడు రామయ్య అనీ, బెస్ట్ వర్కర్ అవార్డు తీసుకోబోయేది సుబ్బారెడ్డి అనీ అందరికీ తెలిసిపోయింది.

సుబ్బారెడ్డి సమర్థుడు అని అందరికీ తెలుసు. ఎలాంటి కాంప్లికేటెడ్ వర్క్ అయినా అతనే చేయాలి. ఏ ప్రాబ్లమ్ వచ్చినా అధికారులకు అతనే దారి చూపించాలి. అలాంటి సంఘటనలు చాలా ఉన్నాయి. ఉత్పత్తి విషయంలో తన స్థాయికి మించిన అద్భుతమైన సలహాలు ఇచ్చిన సందర్భాలూ వున్నాయి. ఇవన్నీ జనరల్ మేనేజర్ గురుమూర్తికి తెలుసు. అందుకే 'బెస్ట్ వర్కర్' అవార్డు సుబ్బారెడ్డికే వస్తుందని అనధికారికంగా ఆయన బయటకు పొక్కేలా చేసేడు. ఆ నిర్ణయం మీద ఎవరికీ అసంతృప్తి లేదు. అసమ్మతీ లేదు. కార్మికులు, ముఖ్యంగా సుబ్బారెడ్డి స్నేహితులు చాలా సంతోషపడ్డారు. మరీ ముఖ్యంగా అంజయ్య.

అతడు సుబ్బారెడ్డికి మంచి మిత్రుడు. చిన్ననాటి స్నేహితుడు. వాళ్ళిద్దరి కుటుంబాలు కూడా ప్రేమగా, స్నేహంగా ఉంటాయి. అందువల్ల సుబ్బారెడ్డికి అవార్డు వచ్చిన సందర్భాన్ని అంజయ్య సెలబ్రేట్ చేసేడు. మిత్రులందరికీ పార్టీ ఇచ్చేడు.

సుబ్బారెడ్డి ఇదంతా పెద్దగా పట్టించుకున్నట్టు కనిపించలేదు. అది అతడి ధోరణి. ఆ సంగతి అంజయ్యకు తెలుసు.

❁ ❁ ❁

రెండు రోజుల తర్వాత మరో సంగతి జరిగింది.

ఆ రోజు ఉదయం టీబ్రేక్ ముగుస్తుండగా హఠాత్తుగా మేనేజింగ్ డైరెక్టర్ ముఖర్జీ అక్కడ

ప్రత్యక్షమయ్యేడు. వర్క్‌షాపులో చొరబడి నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ అందరినీ పరికిస్తున్న ఆ బెంగాల్ టైగర్‌ని చూసి కార్మికులు అడవి దున్నల్లా కకావికలయ్యేరు. గబగబ తమ తమ వర్క్‌స్పాట్‌లకు పరుగులు తీసేరు.

ముఖర్జీ కార్మికులను దూరం నుంచి, అవసరమైతే దగ్గర నుంచి వాచ్ చేస్తూ ముందుకు అడుగు వేస్తున్న వాడల్లా సుబ్బారెడ్డి దగ్గర ఆగేడు.

సుబ్బారెడ్డి ఎమ్‌డిని గమనించలేదు.

టీబ్రేక్‌లో టీ కూడా తాగకుండా ఒక పనిలో నిమగ్నమై ఉన్నాడు అతను. కానీ అది కంపెనీ పని కాదు. ఎవరికో ఒక తాళం చెవి మిషన్ మీద చేస్తున్నాడు.

ముఖర్జీ వచ్చి ఏం చేస్తున్నావని అడిగేసరికి బిక్కచచ్చిపోయేడు సుబ్బారెడ్డి. ఆఫీసులో కలవమని చెప్పి ముందుకు కదిలేడు ముఖర్జీ.

తర్వాత ఇద్దరు ముగ్గురు కార్మికులను దాటుకుంటూ ముందుకు వెళ్ళి అంజయ్య దగ్గర ఆగిపోయేడు.

అంజయ్య మిషన్ పైనున్న రెడ్యూసర్‌ని ఎదురుగా ఉన్న డ్రాయింగ్ ప్రకారం తుచ తప్పకుండా చేస్తూ పనిలో నిమగ్నమై ఉన్నాడు. అతని చేతులూ, చూపులూ, దీక్షా లక్ష్యం అంతా ఆ ప్రోడెక్ట్ పైనే ఉన్నాయి. ఆ ఏకాగ్రత వల్ల టీబ్రేక్ విషయం కూడా గమనించలేదు. ఆ విధంగా టీ మిస్ కావడం అతనికి కొత్త కాదు.

పనిచేసుకుంటున్న అంజయ్యను డిస్టర్బ్ చేయకుండా ముఖర్జీ అక్కడి నుంచి వెళ్ళిపోయేడు.

ముఖర్జీ నిష్క్రమించాక కాకుల మూకలా తోటి కార్మికులు అంజయ్య చుట్టూ చేరేరు.

'ఎమ్‌డీగారు నీ దర్శనం కోసం వచ్చేరు తెల్సా. నీవు లార్డ్ కర్జన్‌లాగ ఆయన్ని ఖాతరు చేయకపోవడంతో ఆగ్రహించి వెళ్ళిపోయేడు తెల్సా' అని ఇంతదాన్ని అంత చేసి అంజయ్యను హడలు గొట్టేశారు.

అంజయ్యకి మతిపోయింది. కావాలని తనేమీ చేయలేదు. తన పనిలో తను ఉన్నాడు. ఇదెక్కడి గొడవ.

ఆ తర్వాత ఎమ్‌డి ఛాంబర్‌కి అంజయ్య, సుబ్బారెడ్డిలు పిలవబడ్డారు.

వాళ్ళిద్దరితో ఎమ్‌డి విడివిడిగా మాట్లాడేడు. మాటాడేక జనరల్ మేనేజర్ గురుమూర్తితో చర్చించేడు. చర్చించేక గురుమూర్తి సంతకంతో సుబ్బారెడ్డికి ఒక మెమో యిచ్చి, హెచ్చరించి మొదటి తప్పు కింద క్షమించి వదిలేశారు. ఆ బాడ్ రిమార్కు అతని పెర్సనల్ ఫైల్‌లో ఒక మాయని మచ్చలా రికార్డయింది.

అంజయ్యని ఎమ్‌డి అభినందించినట్లు తెలిసింది.

రిపబ్లిక్‌డే సెలబ్రేషన్స్ మరో మూడు రోజుల్లో ఉందనగా యాజమాన్యం బెస్ట్ వర్కర్ అవార్డు ఎవరికిస్తున్నదీ ప్రకటించింది.

అది సుబ్బారెడ్డికి కాదు. అంజయ్యకి.

గురుమూర్తి సంతకంతో ఇంటిమేషన్ కాగితం, మేనేజర్ ద్వారా అంజయ్యకు చేరింది. నోటీస్ బోర్డులో కూడా పెట్టబడింది.

ఆ మార్పు అందరూ ఊహించినదే.

అవార్డు సుబ్బారెడ్డికి మిస్ అయినందుకు ఆశ్చర్యపోలేదు కాని బాధపడ్డారు. బాడ్‌లక్ అనుకున్నారు. అదృష్టవంతుడైన అంజయ్యను హృదయపూర్వకంగా అభినందనలతో ముంచెత్తారు.

అంజయ్యకి ఈ పరిస్థితి చాలా యిబ్బందిగా ఉంది.

అవార్డు రావాల్సిన సుబ్బారెడ్డికి మెమో ఇచ్చి, తనకి అవార్డు ప్రకటించడం అతణ్ణి బాధపెట్టింది.

ఎమ్‌డి దృష్టిలో సుబ్బారెడ్డి చెడుగా స్టాంప్ బడటం నిజంగా దురదృష్టం. సుబ్బారెడ్డి ఎటువంటి వాడో అంజయ్యకు తెలుసు. అతనెప్పుడూ కంపెనీ పని కాకుండా ఏ ఇతర పనులూ చేయడు. ఇప్పుడు కూడా చేసింది సొంతానికి కాదు. ఒక పై అధికారి చేయమంటే కాదనలేక చేసేడు. అది కూడా వర్కింగ్ అవర్స్‌లో చేయడం యిష్టం లేక టీబ్రేక్‌లో మొదలెట్టేడు. అయినంతపని అయ్యాక మిగతాది లంచ్‌టైమ్‌లో పూర్తి చేయాలని అతని ప్లాను. అతడి నిజాయితీ ఎవరిక్కావాలి? ఎవరు అర్థం చేసుకుంటారు?

మెమోకి జవాబు ఇవ్వమన్నాడు అంజయ్య. ఒక అధికారి కారణంగా తప్పనిసరి పరిస్థితుల్లో తనా పని చేయాల్సి వచ్చిందని కాగితంపై పెట్టమన్నాడు. అధికారి ఏ పని చేయమంటే ఆ పని చేస్తామని, ఇందులో తన తప్పు ఏ మాత్రం లేదని రాస్తూ ఆ అధికారి పేరు కూడా ప్రస్తావించమన్నాడు.

సుబ్బారెడ్డి నవ్వేశాడు. అధికారి ఎవరో చెప్పలేదు. కాగితమూ రాయలేదు.

అది చూసి 'ఛ..వీడి పద్ధతే వేరు. దేనికీ సహకరించడు' అని తల పట్టుకున్నాడు అంజయ్య.

మరోవైపు మిత్రులందరూ అవార్డు వచ్చిన అంజయ్యని పార్టీ యివ్వమని ఒత్తిడి చేసేరు. చిర్రెత్తుకొచ్చింది అంజయ్యకి.

'ఒరే.. మీకేమైనా బుద్ధీ బుర్రా ఉందా. నాకు అవార్డు ఏమిటి? అది సుబ్బారెడ్డిది. అవార్డు వాడికే యివ్వాలని మీరంతా యాజమాన్యంపై తిరుగుబాటు చేయండి. భయపడకండి. నేనే ముందుంటాను' అన్నాడు అంజయ్య.

సుబ్బారెడ్డి ఆ మాటలను ఖండించాడు.

'వద్దు. వద్దు. అలాంటి గొడవలు వద్దు. పోరాటాలు కార్మికులందరి సమస్యపై చెయ్యాలి గాని ఏ ఒక్కడి కోసమో కాదు. మనం మేనేజ్‌మెంట్ నిర్ణయాన్ని గౌరవిద్దాం. అర్హులు ఎంతమంది ఉన్నా అవార్డు వచ్చేది ఒక్కరికే కదా. మన అంజయ్య ఈ అవార్డుకి నూటికి నూరు పాళ్ళు అర్హుడు. అంజయ్యను మనం అభినందించాల్సిన సమయం. ఈ శుభసందర్భంలో నేనే సంతోషంగా పార్టీ యిస్తున్నాను' అని మిత్రులందరికీ పార్టీ యిచ్చాడు.

అంజయ్యకి యిదేమీ రుచించలేదు. ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు.

మరుసటి రోజు ఉదయం తన మనసులోని బాధను గురుమూర్తికి చెప్పుకోవాలను కున్నాడు. సుబ్బారెడ్డిపై అతనికీ మంచి అభిప్రాయమే ఉంది గనుక ఏమంటాడో చూద్దాం అనుకున్నాడు.

అంజయ్య నిద్రలేచేటప్పటికి భళ్లున తెల్లవారింది.

కంపెనీలో మరో సంచలనం. పేపర్లలో వార్త.

గోపాలంకు 'శ్రమశక్తి' అవార్డు వచ్చింది.

రెండు వేల మంది కార్మికులుండే ఒక కంపెనీ నుంచి అంజయ్యకు ఏదో చిన్న సైజు అవార్డు వస్తే అదే కంపెనీ వర్కర్ గోపాలంకి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ కార్మికులకిచ్చే 'శ్రమశక్తి' అవార్డు దక్కింది. మరో వారం రోజుల్లో రాష్ట్ర రాజధానిలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆ అవార్డు అందుకోబోతున్నాడు గోపాలం.

ఇది చూసి, చదివి అందరూ ముక్కు మీద వేలేసుకున్నారు. కంగ్రాట్స్ చెప్పడానికి గోపాలాన్ని వెతుక్కుంటూ ఒక్కరూ పరిగెట్టలేదు. స్వయానా గోపాలమే తన పరివారంతో మిఠాయి పొట్లాలతో రంగప్రవేశం చేసి ఒక్కొక్క కార్మికుని చెంతకు వెళ్ళి వాళ్ళ నుంచి అభినందనలు బలవంతంగా స్వీకరించి, స్వీటు అందించేడు.

అలా అందర్నీ టచ్ చేస్తూ వర్క్‌షాపులో పనిచేసుకుంటున్న అంజయ్యను ఢీ కొట్టేడు గోపాలం.

'బెస్ట్ వర్కర్ అవార్డు కొట్టేసినందుకు కంగ్రాట్స్. అక్కడితో నీవు ఆగిపోకుండా నాలా రాష్ట్ర స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నాను. అల్ ది బెస్ట్' అని షేక్‌హ్యాండ్ యిచ్చి విజయగర్వంతో నవ్వుకుంటూ వెళ్ళిపోయేడు గోపాలం.

స్వీటుని డస్ట్‌బిన్‌లోకి ఫడేల్మని విసిరికొట్టాడు అంజయ్య. ఆ తర్వాత పనిలో పడిపోయాడు.

టీబ్రేక్‌లో గోపాలం లీలలు కార్మికుల మధ్య చర్చకు వచ్చేయి. అతనికొచ్చిన శ్రమశక్తి అవార్డుని అర్హతలేని రచయిత పుల్లారావుకి ఇచ్చిన అకాడమీ అవార్డుతో పోల్చేడు కనకరాజు. ఆ విధంగా పోల్చడం సరికాదని శివరావు అన్నాడు.

ఏమంటే పుల్లారావు అకాడెమీ అవార్డుకి అర్హత పొందే గొప్ప రచయిత కాకపోయినా అతడొక మంచి రచయితే అన్నది అందరికీ తెలుసు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ కార్మికుడు అవార్డు పొందిన గోపాలం కార్మికుడని అసలు ఎంతమంది ఒప్పుకుంటారు? పుల్లారావు రచయితేగాని గోపాలం కార్మికుడు కాదు. అంచేత నీ సామ్యం బాగోలేదు అన్నాడు శివరావు.

నవ్వేరు మిగతా కార్మికులు.

'ఇన్నేళ్ళ సర్వీసులో గోపాలం పని చేస్తుండగా నేను ఏ రోజూ చూసినట్టు గుర్తులేదు' అని సురేష్ అంటే –

'వాడి దగ్గర పది వేల అప్పు పది రూపాయల వడ్డీకి తీసుకో. రోజూ నీకు సింహస్వప్నమై కనిపిస్తాడు' అన్నాడు శివరావు.

మళ్ళీ నవ్వులు.

ఆ నవ్వుల వెనుక అర్థం ఉంది.

గోపాలం పాతికేళ్ళ క్రితం ఆ కంపెనీలో ఒక మెకానిక్‌గా మూడు వందల రూపాయల జీతానికి జాయిన్ అయినప్పుడు అతని ఆస్తి ఒక ఆవకాయ జాడి, రెండు జతల బట్టలు. అదే గోపాలం ఇప్పుడు ఒక కరోర్‌పతి. కంపెనీకి కారు మీద వచ్చి వెళ్ళే ఆరణాల కార్మికుడు.

ఆ రోజుల్లో గోపాలం పిఎఫ్‌లోను పెట్టి, పెళ్ళాం తెచ్చిన పాతిక వేల కట్నం మదుపుతో వడ్డీ వ్యాపారం ప్రారంభించేడు. అది యిక గుడ్లు పెట్టడం మొదలెట్టింది. ప్రస్తుతం అతనికి వడ్డీ వ్యాపారమే కాక రియల్ ఎస్టేటు బిజినెస్ కూడా ఉంది. అందుకు తను వేరేగా కస్టమర్లు వెదుక్కోనక్కరలేదు. కార్మికులే కాదు ఆఫీసర్లు కూడా అతడికి రుణపడి వున్నవారే.

గోపాలం వర్క్‌షాపుకి వచ్చి పని చేయకపోవడమే కంపెనీకి మంచిదిగా భావిస్తాడు గురుమూర్తి. అవార్డు తెచ్చుకున్న గోపాలంని పేపర్లో భట్రాజులా పొడిగింది కూడా ఆ గురుమూర్తే. అతడికి ఆబ్జెక్టివ్‌గా అంజయ్యలూ సుబ్బారెడ్డిలూ కావాలి, సబ్జెక్టివ్‌గా గోపాలం లాంటి వాళ్ళూ కావాలి.

గోపాలంకి పని చేయడం రాదు. ప్రొడెక్ట్ పాడైతే అదొక పెద్ద తలనొప్పి. ఇంక రెండో కారణం. గోపాలం వర్క్‌షాపులో ఉంటే తను పని చేయకపోగా చేసేవాళ్ళను చెడగొడ్తాడు. అంచేత గోపాలంకి దండం పెట్టి బయటకు పొమ్మంటాడు గురుమూర్తి.

సిరిసంపదలు, సమస్త సుఖాలు, సరదాలతో జీవితం నల్లేరుపై బండిలా చల్‌మోహనరంగా అంటూ సాగిపోతున్నప్పటికీ గోపాలం ఒక్కసారిగా నిలబడిపోయేడు. అతని కెందుకో అకస్మాత్తుగా 'శ్రమశక్తి' అవార్డు పొందాలనే కోరిక కలిగింది. అది అతణ్ణి నిలవనీయకుండా ఉక్కిరిబిక్కిరి చేసింది.

వెంటనే అతడు జిఎం గురుమూర్తి, యూనియన్ సెక్రటరీ విశ్వనాథం ముందు వాలేడు. వాళ్ళు తమ పరిధులను దాటి, ఉల్లంఘించి, అతిక్రమించి ఉత్సాహంతో సహాయ సహకారాలు అందించేరు. చివరి మజిలీ స్థానిక ఎమ్మెల్యే దగ్గర ఆగింది.

అతడు 'బ్రదర్. ఇది నా చేతిలో లేదు. కాస్త పెద్ద లెవిలు. కొద్దిగ కష్టం' అన్నాడు.

'కష్టం' అనే పదానికి వుండే వివిధ రకాల అర్థాలు గోపాలానికి తెలుసు. అంచేత కృష్ణారావు ప్రకటించిన సదరు కష్టాన్ని రూపాయలతో కొలిచి రూపుమాపేడు. మార్గం సుగమం అయింది. 'శ్రమశక్తి' అవార్డు పూలగుత్తిలా గోపాలం చేతిలో వాలిపోయింది.

పైరవీల పల్లకీలో ఊరేగుతూ సహజ పరిమళం కోల్పోయిన 'శ్రమశక్తి' అవార్డుపై కార్మికుల నుంచి రకరకాల వ్యాఖ్యలు, భాష్యాలు, వ్యంగ్య విసురులు, హేళన మిళితమైన

నవ్వులు. కంపెనీ అంతా గోల గోల.

అంజయ్య మాత్రం గోపాలంపై ఎటువంటి కామెంట్ చేయలేదు. 'నీవు నా స్థాయి కెదగాలి' అని గోపాలం చేసిన కామెంట్ మాత్రం అంజయ్యకి పదే పదే గుండెల్లో గునపంలా గుచ్చుకుంటోంది.

అంజయ్య తన జేబులోంచి కాగితం తీసేడు. అది తనకు 'బెస్ట్ వర్కర్' అవార్డు యిస్తున్నందుకు సంతోషపడుతున్నట్టుగా యాజమాన్యం అందించిన లెటర్. అంగీకారం తెలియచేయమని రాసి వుంది. అంగీకారం తెలియచేయకపోయినా అతని కివ్వబోయే అవార్డు ఆగిపోదు. జస్ట్ ఫార్మాలిటీ. అంతే!

అంజయ్య కాగితం కలం తీసుకుని స్పందించేడు. తను రాసిన లెటర్‌ని స్వయంగా గురుమూర్తికి యివ్వాలని నిర్ణయించుకున్నాడు.

'బెస్ట్ వర్కర్' సుబ్బారెడ్డికి మెమో వచ్చేలా చేసిన తాళం చెవి సంఘటనను అతడు మర్చిపోలేదు. తాళం చెవి చేయమన్నది గురుమూర్తేనని అతడికి తెలిసిపోయింది. సుబ్బారెడ్డిపై తీవ్ర ఒత్తిడి చేసి ఆ సంగతి రాబట్టాక షాక్ తిన్నాడు అంజయ్య. ఇంటి తాళం చెవికి డూప్లికేట్ చేయమని ఆదేశించిన గురుమూర్తి తన చేతులతోనే బేడీలు వేసినట్టు మెమోని స్వయాన తనే సంతకం పెట్టి మరీ సుబ్బారెడ్డికి జారీ చేయడం అంజయ్య జీర్ణించుకోలేక పోతున్నాడు.

ఎండిని ఒప్పించి సుబ్బారెడ్డికి మెమో రాకుండా మేనేజ్ చేయగల శక్తి గురుమూర్తికి లేదంటే ఎవరూ నమ్మరు.

ఈ కుట్రని యూనియన్ సెక్రట్రీ విశ్వనాథం నోటీసుకు తీసుకెళితే! తీసుకెళ్ళడం ఏమిటీ? వాడికీ తెలుసు.

వాడొక దొంగ. గురుమూర్తి జేబులో బొమ్మ. ఏ కార్మికుడికైనా వాడేం న్యాయం చేయగలడు అనుకున్నాడు అంజయ్య.

యూనియన్ పటిష్టంగా, ప్రభంజనంలా, చైతన్యపూరితంగా వుంటే గురుమూర్తి లాంటి అధికారుల ఆట సాగునా? యావత్ యాజమాన్యం గడగడలాడిపోదా? యూనియన్ లేకపోతేనేం? కార్మికులు తిరుగుబాటు చేయలేరా? అన్యాయాన్ని ఎదిరించలేరా?

'ఒరేయ్ గురుమూర్తి... తప్పు చేసింది నీవురా.. మెమోని మొహానికి అంటించు కోవాల్సింది నీవురా. మా సుబ్బారెడ్డి కానే కాదురా. నీవు అన్యాయంగా సుబ్బారెడ్డి కిచ్చిన మెమో వెంటనే ఉపసంహరించుకోవాలి. కాదన్నావో నీ బతుకుని బజారు కీడుస్తాం.. 'శ్రమశక్తి' అవార్డు గోల్‌మాల్‌లో నీ పాత్రతో సహా బయటపెడతాం. నీవు మా యూనియన్ సెక్రటరీని కొనేసినా వెనుకాడం. పెను ఉప్పెన లాంటి మా కార్మిక శక్తిని నీకు రుచి చూపిస్తాం. కాసుకో. ఖబడ్దార్' అని గురుమూర్తి వర్క్‌షాపు విజిట్‌కి వచ్చేటప్పుడు కార్మికులందరి ముందు నిలదీసి కడిగేయాలన్నంత ఆవేశం కలిగింది అంజయ్యకి.

దీనికన్నా ముందు తను మరో ముఖ్యమైన పని చేయాల్సి ఉంది. తను రాసిన కాగితాన్ని జేబులో పెట్టుకుని గురుమూర్తి కేబిన్ వైపు నడిచేడు అంజయ్య.

అక్కడ కాపలా కూర్చుని ఉన్న పర్సనల్ అసిస్టెంట్ వారిస్తున్నా వినకుండా తోసుకుంటూ కేబిన్ లోపలకు వెళ్లాడు.

గురుమూర్తి తీరుబడిగా గోపాలం, విశ్వనాథంలతో సొల్లు కబుర్లు చెప్తూ కూర్చుని వున్నాడు.

ఆ దృశ్యం చూసిన అంజయ్య తల తిరిగిపోయింది. అసహ్యంతో పాటు ఏదో వికారాన్ని ప్రకోపింపచేసింది.

తన పర్మిషన్ లేకుండా లోనికి ప్రవేశించిన అంజయ్యపై వచ్చిన చిరాకుని గురుమూర్తి కంట్రోల్ చేసుకొని, చిరునవ్వు అంటించుకొని –

'రావోయ్ అంజయ్యా రా!రా! 'బెస్ట్ వర్కర్' అవార్డు పొందిన అంజయ్యకి నా కంగ్రాచ్యులేషన్స్... నిన్ను పిలుద్దామనుకునేలోగా నీవే వచ్చేశావ్... ఇదిగో 'శ్రమశక్తి' అవార్డు గ్రహీత గోపాలం, మీ సెక్రట్రీ విశ్వనాథం ఇక్కడే ఉన్నారు. మంచి సమయంలో వచ్చావు... నీకూ, గోపాలానికీ అవార్డులు రావడం నాకు సంతోషాన్ని కలిగిస్తున్నదోయ్' అన్నాడు.

కంగ్రాచ్యులేషన్స్ చెబుతూ, మర్యాదపూర్వకంగా సీటులోంచి లేచి అంజయ్యకి షేక్‌హ్యాండ్ ఇవ్వలేదు గురుమూర్తి. టేబుల్ చుట్టూ మరో నాలుగు కుర్చీలు ఉన్నాయి. కానీ అంజయ్యా కూర్చోలేదు. గురుమూర్తీ కూర్చోమనలేదు.

ఇంతకాలం, ఏనాడూ కార్మికులను తన ఎదురుగా కూర్చోమనలేదు గురుమూర్తి. అయితే అక్కడ అధికారులకు మొగుళ్ళలా దర్జాగా కూర్చుని వున్న గోపాలం, విశ్వనాథంలు ఇద్దరూ కంపెనీ రోల్స్ ప్రకారం కార్మికులుగా పిలవబడేవాళ్ళే.

అంజయ్య వచ్చే సమయానికి గురుమూర్తి ఆఫర్ చేసిన స్పెషల్ టీ వాళ్ళు తాగుతున్నారు. గురుమూర్తీ తాగుతున్నాడు.

ఆ వేడి వేడి టీ కప్పులు రాత్రికి బార్‌లో చల్లచల్లని మందు గ్లాసులుగా మారిపోతాయి అనుకున్నాడు అంజయ్య.

అతడి మానసిక పరిస్థితి బాగోలేదు. శారీరక స్థితి అలానే ఉంది. ఆ వాతావరణం నుంచి ఎంత వేగిరం బయటపడదామా అని వుంది. గురుమూర్తిపై కసిగా అరిచే శక్తి ఎందుకో హరించుకుపోయింది. తను వచ్చిన పని ముగిద్దామని జేబులోంచి ఒక కాగితం బయటకు తీశాడు.

ఆ సమయంలో గురుమూర్తి కెందుకో గోపాలంని చిన్న ఆట పట్టిద్దామనిపించింది. అంజయ్య ద్వారా ఒక విసురు విసిరేడు.

'అంజయ్యా! నీకూ, గోపాలానికీ వచ్చిన అవార్డుల్లో ఒక తేడా వుందోయ్. ఒకరు సాధించింది. మరొకరు సంపాదించింది. గమనించేవా?' అంటూ వికవిక నవ్వేడు

గురుమూర్తి.

గోపాలం, విశ్వనాథంలు తెల్లబోయి ఆ వెంటనే పళ్ళికిలించేరు.

'ఏమిటీ అంజయ్యా! మాట్లాడవేం?' అంటూ నవ్వుతూనే అంజయ్యను ఎగదోసేడు గురుమూర్తి.

'తేడా వుందంటూ మీరంతా ఎలా నవ్వగలుగుతున్నారు? నవ్వడం కాదు. సిగ్గు పడాలి. తల దించుకోవాలి. తేడా అన్నారు కాబట్టి చెబుతున్నాను. నాకు మీరు, ఈ యాజమాన్యం, ఈ ప్రభుత్వం - సమస్తం నాకు తేడాగా కనిపిస్తోంది' అన్నాడు అంజయ్య.

గురుమూర్తి ముఖం నల్లబడి పోయింది.

'అంజయ్యా! ఏమిటీ పెద్ద కబుర్లు ఆడుతున్నావ్. ఒంట్లో బాగోలేదా?'

'అవున్సార్. నిజంగానే నాకు ఇంట్లో బాగోలేదు. తల తిరుగుతోంది. ఒళ్లు తిప్పుతోంది. కడుపు తిప్పుతోంది. నేను వెళతాను. దయచేసి ఈ కాగితం తీసుకోండి."

అంజయ్య చేతిలోంచి విసురుగా కాగితం తీసుకుని చదివేడు గురుమూర్తి.

అది రిగ్రెట్ లెటర్. తనకు యాజమాన్యం దయతో ప్రకటించిన 'బెస్ట్ వర్కర్' అవార్డు స్వీకరించే శక్తి, అర్హత తనకు లేవని, అంతేకాదు ఉత్తమ కార్మికుడు సుబ్బారెడ్డికి అన్యాయంగా మీరు ఇష్యూ చేసిన మెమోకి ఇది నా నిరసన అని రాసి ఉంది ఆ ఉత్తరంలో.

గురుమూర్తి ఉగ్రుడయ్యేడు.

'ఏమిటిది? నీకేమైనా బుద్ధి వుందా? నీకు యాజమాన్యం ఇచ్చిన అవార్డు తిరస్కరించడమే కాకుండా, సుబ్బారెడ్డి తరఫున నిరసన తెలియజేసేటంత మొనగాడివా నీవు. బ్లడీ నాన్సెన్స్. నీకేం తెలుసు? సుబ్బారెడ్డి చేసిన నేరం చిన్నది కాదు. సస్పెండ్ చేయాల్సినంత నేరం. నేను కాబట్టి ఒక మెమోతో సరిపెట్టేను. ఇవన్నీ నీకు చెప్పాల్సిన అవసరం లేదు. ఏమైనా నిరసనలు తెలియజేయడానికి నీ వెవడివి? అది మీ యూనియన్ పని. నీవీ కాగితం వెనక్కి తీసుకోకపోతే నీపై క్రమశిక్షణ చర్య తీసుకోవాల్సి వుంటుంది' అంటూ వెర్రెక్కి పోయేడు గురుమూర్తి.

ఆ కాగితం వెనక్కి తీసుకోమని అంజయ్యని నచ్చచెప్పబోయేరు విశ్వనాథం, గోపాలంలు.

అయినా కాగితం వెనక్కి తీసుకోలేదు అంజయ్య. గురుమూర్తి పేలిన పేలుడికి తగిన సమాధానం చెప్పాలని ఉన్నా, అతనిలో మహోత్పాతమేదో జరిగి నిలవనీయలేదు. సముద్రంలో భూకంపాలతో పోటెత్తే వరదల ఉధృతిలా, తీరం తాకిన సునామీ కెరటంలా అంజయ్య కడుపులో ఉన్నదంతా ఉవ్వెత్తున భళుక్కుమని బయటకు వచ్చేసింది.

పెద్ద వాంతి! టేబుల్ అంతా పరమ కంగాళీ అయి కక్కు ఉప్పెనలా అంత ఎత్తున ఎగసి గురుమూర్తితో బాటు గోపాలం, విశ్వనాథంలను ముంచెత్తింది. వాళ్ళు బెంబేలెత్తి పోయేరు.

ఆ తర్వాత శాంతించిన సముద్రంలా అంజయ్య శరీరం తేలికయ్యింది.

కేబిన్ నుంచి బయటపడి నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళిపోతున్న అతణ్ణి ఈసారి ఎవరూ అపలేదు.